క్లుప్తంగా

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు



వేంపాడు సత్యసాయి మందిరంలో భజనలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి: భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వేంపాడు సత్యసాయి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే మందిరంలో భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. పేదలకు వస్త్ర దానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

సమగ్ర ఓటరు సర్వే పరిశీలన



వేంపాడులో ఓటర్ల జాబితాల పరిశీలనలో తహసీల్దార్

నక్కపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ అంబేద్కర్ ఆదివారం పరిశీలించారు. వేంపాడు, నెల్లిపూడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో గృహాలను సందర్శించారు. బీఎల్వోల పనితీరును పరిశీలించారు. ఎంతమంది వివరాలు సేకరించారు? కొత్త ఓటర్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలపై ఆరా తీశారు. బీఎల్వోలంతా ప్రతి గృహాన్ని సందర్శించాలని సూచించారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి



గవర్ల అనకాపల్లి శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నాయకులు

మునగపాక: గవర్ల అనకాపల్లి శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లిలోని శ్మశాన వాటికను స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికలో దహన సంస్కారాలకు అవసరమయ్యే ఏర్పాట్లు, మొక్కలు నాటేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, సచివాలయ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము తదితరులున్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు అందిస్తున్న చందు

మునగపాక: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం పంచాయతీ పరిధిలోని యువతకు ఆయన ఆదివారం క్రికెట్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని, వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జేఎల్‌పీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

డీసీఈబీ సభ్యునిగా ఖాసిమ్

కె.కోటపాడు: అనకాపల్లి జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డ్ మెంబర్‌గా కె.కోటపాడు అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే ఖాసిమ్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖాధికారి వెంకట లక్ష్మమ్మ నుంచి ఆదివారం ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. ఖాసిమ్ నియామకం పట్ల అపుస్మా రాష్ట్ర కోశాధికారి ఎంవీ రావు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల అపుస్మా అధ్యక్షులు అభినందించారు.

నాడు-నేడు.. నిర్మాణాల జోరు

- రెండో దశలో 36 స్కూళ్ల అభివృద్ధికి చర్యలు
- రూ.15.90 కోట్లతో అదనపు సౌకర్యాలు
- అక్టోబర్ నాటికి పూర్తయ్యేలా ఏర్పాట్లు



దేవవరం జెడ్పీ హైస్కూల్లో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్న దృశ్యం



కొత్తూరు మరుగుదొడ్ల నిర్మాణపు పనులు పరిశీలిస్తున్న ఎంఈవో

నక్కపల్లి: ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మారనున్నాయి. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నాడు-నేడు పథకం రెండో దశలో చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొదటి విడత పనులు గతంలోనే పూర్తయ్యాయి. వాటి ఫలితాల పట్ల ప్రభుత్వం, ప్రజల్లో నమ్మకం పెరిగింది. రెట్టింపు ఉత్సాహంతో రెండో విడత పనుల్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. అక్టోబర్‌నాటికి పనులు పూర్తి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం మేరకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది.

36 స్కూళ్లకు రూ.15.90 కోట్లు

నక్కపల్లి మండలంలో రెండవ విడతలో 36 పాఠశాలలను ఎంపిక చేశారు. వీటి అభివృద్ధికి ప్రభుత్వం రూ.15.90 కోట్లతో అంచనాలకు ఆమోదం తెలిపింది. ఇప్పటికే రూ.6 కోట్లు విడుదల చేశారు. పనులు పూర్తి మేరకు ఇందులో రూ.5.60 కోట్లు చెల్లింపులు చేశారు. నాడు నేడు రెండో దశలో దోసలపాడు, సారిపల్లిపాలెం అయ్యన్నపాలెం, మనబానవానిపాలెం, వి.కొత్తూరులలో ప్రహరీ గోడల నిర్మాణం, దోసలపాడులో అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవన నిర్మాణం చేపట్టారు. అయ్యన్నపాలెం, చినదొడ్డిగల్లు, దోసలపాడు, మనబానవానిపాలెం, వేంపాడు కొత్తూరులలో మరుగుదొడ్లు నిర్మిస్తున్నారు. దేవవరం, చినదొడ్డిగల్లు, వెదుళ్లపాలెం, అయ్యన్నపాలెం, మనబానవానిపాలెం, సారిపల్లిపాలెం, వేంపాడు కొత్తూరులలో అదనపు తరగతి గదులు, వంటషెడ్లు, మేజర్ మరమ్మతులు శరవేగంగా జరుగుతున్నాయి. అదనపు తరగతి గదుల్లో డిజిటల్ క్లాస్‌రూంలు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే పాఠశాలల్లో తాగునీటి సదుపాయం రన్నింగ్ వాటర్ సదుపాయం కూడా కల్పిస్తున్నారు. పనుల నాణ్యతకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

రెండో దశ నాడు-నేడు పనులు	
అదనపు తరగతి గదులు	17 స్కూళ్లు
ప్రహరీ గోడలు	5 స్కూళ్లు
మరుగుదొడ్లు	14 స్కూళ్లు
వంట షెడ్లు	12 స్కూళ్లు
మేజర్, మైనర్ రిపేర్లు	15 స్కూళ్లు
విద్యుదీకరణ పనులు	15 స్కూళ్లు

హెచ్ఎంలు, పేరెంట్స్ కమిటీలదే బాధ్యత

పాఠశాలల్లో నాడు-నేడు పనుల బాధ్యత పూర్తిగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ పర్యవేక్షణలో ఈ పనులు జరుగుతున్నాయి. నిర్మాణ పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. తమ పిల్లలు చదువుకునే స్కూల్‌ను, తమ సమీపంలోని కార్పొరేట్ స్కూళ్లకు మించి తీర్చిదిద్దుకోవాలన్న తపన పేరెంట్స్ కమిటీలో తీసుకొచ్చారు. దీంతో పాటు జిల్లా స్థాయి అధికారులు కూడా ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షిస్తుండటంతో జాప్యం లేకుండా చురుగ్గా జరుగుతున్నాయి. పాఠశాలల్లో ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా ఆకర్షణీయమైన వాల్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా

నాడు నేడు రెండో దశలో 36 పాఠశాలలను ఎంపిక చేసి, వాటిలో అవసరమైన పనులను చేపడుతున్నాం. ఇప్పటివరకు పూర్తయిన పనులకు రూ.5.60 కోట్లు చెల్లింపులు జరిగాయి. పనుల నాణ్యత విషయంలో రాజీ పడటం లేదు. హెచ్‌ఎంల పర్యవేక్షణలో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. అక్టోబరు నెలాఖరుకు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలతోపాటు, ఆకర్షణీయంగా తరగతి గదులు, డిజిటల్ క్లాస్‌రూంలు ఏర్పాటు చేయనున్నాం. కార్పొరేట్ స్కూళ్లకు మించి సర్కారీ స్కూళ్ల రూపురేఖలు మారనున్నాయి.

– కుంచం నరేష్, ఎంఈవో, నక్కపల్లి

'వార్డుల్లో' వైఎస్సార్‌సీపీ సత్తా

పంచాయతీ వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ సత్తా చాటింది. వార్డు సభ్యుల స్థానాల్లో ప్రత్యర్థి టీడీపీని మట్టి కరిపించింది. ఈ ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ ఏకమైనప్పటికీ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థుల విజయాన్ని అడ్డుకోలేక చతికిలపడ్డాయి.



నాయుడు నానాజీ



సాదిరెడ్డి బుజ్జమ్మ



మేడిశెట్టి నూకరాజు



బళ్లింక లోవతల్లి



ఎస్.అరుణకుమారి



పోలవరపు చిట్టిబాబు

నక్కపల్లి/రాంబిల్లి/అచ్యుతాపురం: స్థానిక సంస్థల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు విజభేరీ మోగించారు. ఎన్నికలు ఏవైనా.. గెలుపు వైఎస్సార్‌సీపీదేనని మరోసారి చాటిచెప్పారు. ఏకగ్రీవాల్లో విపక్ష పార్టీలు అందుకోలేని స్థాయిలో ఉన్న పార్టీ అభ్యర్థులు, ఓటింగ్ జరిగిన చోటా పార్టీకి తిరుగులేదని తేల్చిచెప్పారు. శనివారం వెల్లడించిన ఫలితాల్లో నక్కపల్లి మండలంలోని రేబాక 10వ వార్డులో సాదిరెడ్డి బుజ్జమ్మ, అచ్యుతాపురం మండలం హరిపాలెం 11వ వార్డు నుంచి ఎస్.అరుణకుమారి, మోసయ్యపేట 4వ వార్డు నుంచి సూరిశెట్టి గణేశమ్మ, రాంబిల్లి మండలం కుమ్మరాపల్లి 1వ వార్డు నుంచి బళ్లింక లోవతల్లిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నాలుగు వార్డుల్లో విపక్ష పార్టీల నుంచి ఎవరూ బరిలో నిలిచే సాహసం చేయలేకపోయారు. నక్కపల్లి, చినదొడ్డిగల్లు 1వ వార్డులో నాయుడు నానాజీ, పాయకరావుపేట శ్రీరాంపురం 8వ వార్డులో మేడిశెట్టి నూకరాజు, అచ్యుతాపురం దిబ్బపాలెం 4వ వార్డులో పోలవరపు చిట్టిబాబులు తమ సమీప ప్రత్యర్థుల కంటే అధిక ఓట్లు సాధించి, విజయ ఢంకా మోగించారు.

హేతువాది దభోల్కర్‌కు నివాళి



దభోల్కర్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేవీవీ ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రముఖ హేతువాది డాక్టర్ నరేంద్ర అచ్యుత్ దభోల్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని అచ్యుతాపురం మండలం జన విజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఆదివారం పలు చోట్ల నిర్వహించారు. శాఖా గ్రంథాలయం, మోసయ్యపేట ప్రాథమిక పాఠశాల, శ్రీ భవానీ విద్యానికేతన్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ దభోల్కర్ చూపిన బాటలో శాస్త్రీయ దృక్పథం అంటే సాక్ష్యాధారాల మేరకు నమ్మడం, సమస్యకు హేతుబద్ధ పరిష్కారం కనుక్కోవడం అని తెలిపారు. నేడు కులం, మతం పేరుతో జరుగుతున్న విధ్వంసాన్ని ఖండించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో బొడ్డేడ రామ్‌కుమార్, గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు, సోమునాయుడు, ఆర్.లక్ష్మి, కొల్లి రాజు, ఉషా, సన్యాసి, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ప్రసవాలతో తల్లీబిడ్డా క్షేమం



తల్లీ బిడ్డతో డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది

రాంబిల్లి: పీహెచ్‌సీలో ప్రసవాలతో తల్లీ బిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండే అవకాశాలు మెండుగా ఉంటాయని దిమిలి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆదివారం ప్రసవం జరిగింది. దిమిలి గ్రామానికి చెందిన భవాని ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ ప్రసవాన్ని డాక్టర్ వెంకటేష్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది నిర్వహించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి తెలిపారు. తమ పీహెచ్‌సీలో ప్రసవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా ప్రసవాలు చేయడమేగాక, అవసరమైన అన్ని మందులు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో ధార్మిక కమిటీల బలోపేతానికి కృషి



సమరసత సేవా ఫౌండేషన్ శిక్షణతరగతుల్లో మాట్లాడుతున్న సత్యనారాయణ

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామాల్లో ధార్మిక కమిటీలు బలపడాలని సమరసత సేవా ఫౌండేషన్ పరియోజన ప్రముఖ్ శిరియాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ప్రచారకులు ఆడారి గంగాధర్ అధ్యక్షతన గ్రామ కన్వీనర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రముఖ్ పోతు రంగారావు మాట్లాడుతూ దేవాలయాలు శక్తివంతంగా మారాలని, వారం వారం భజనలు, ప్రతి నెలా సామూహిక హారతి, నగర సంకీర్తన నిర్వహించాలని కోరారు. ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ 31న రక్షా బంధన్ కార్యక్రమాన్ని ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో దేవాలయాల్లో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ద్వారపురెడ్డి బాబ్జి, రెడ్డి అప్పలనాయుడు, గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్, చోడపల్లి సత్యం, చింతకాయల గగన్ కుమార్, కొల్లి అప్పారావు, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధుల నుంచి రక్షణ



దోమల దినోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ వాసంతి



మునగపాకలో దోమల దినోత్సవ ర్యాలీ

ఎస్.రాయవరం: దోమల వృద్ధితో రోగాల వ్యాప్తి పెరుగుతుందని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాసంతి హెచ్చరించారు. పీహెచ్‌సీలో ఆదివారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధులను అరికట్టేందుకు దోమల నియంత్రణే ఉత్తమ మార్గం అన్నారు. 1897 ఆగస్టు 20న సర్ రోనాల్డ్‌రాస్ దోమల కారణంగా మలేరియా వ్యాపిస్తున్నట్లు కనుగొన్నారని, అందుకు గుర్తుగా ఈ రోజును దోమల దినోత్సవంగా ప్రపంచమంతా నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఆయుష్ వైద్యులు సుజాత, ఆరోగ్య విస్తరణాధికారి బి.సత్యనారాయణ, పీహెచ్‌ఎస్ ప్రసాద్, సచివాలయం హెల్త్ సెక్రటరీ పి.రాములు, ఎన్.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మునగపాక పీహెచ్‌సీ వైద్యాధికారి నంది విమలగిరి కోరారు. ప్రపంచ దోమల దినోత్సవంలో భాగంగా ఆదివారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నియంత్రణతోనే చాలా వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చన్నారు. కాలువల్లో, ఇంటి పరిసరాల్లో నిల్వ నీరు లేకుండా చూసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు ప్రతి ఒక్కరూ దోమ తెరలు వినియోగించాలని సూచించారు. ర్యాలీలో సీహెచ్‌వో దేవకాంత, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.ఉమామహేష్, వీఎస్ఎం లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు సంతోషి, భవాని, ఏఎన్ఎంలు జయశ్రీ, దేవకి, రేవతి, ఆరోగ్య కార్యకర్తలు వి.జగన్నాథరావు, లక్ష్మి, జయపద్మ, రూప, విజయలక్ష్మి, గౌరి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దుప్పతూరుకు అంబులెన్స్ వితరణ



అంబులెన్స్ తాళాలు అందిస్తున్న సైనా ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరుకు అంబులెన్స్‌ను సైనా లేబొరేటరీ బహూకరించింది. గ్రామ ప్రజల ఆరోగ్య అవసరాలకు ఈ అంబులెన్స్‌ను ఉపయోగించుకోవచ్చని లేబొరేటరీ ప్రతినిధులు ఎంపీ రామేశ్వరరావు, తాతారావు నాయుడు, మేనేజర్ దొరబాబు పేర్కొన్నారు. ఈ మేరకు అంబులెన్స్ తాళాలను గ్రామ సర్పంచ్ దేశంశెట్టి శంకరరావుకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబురాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. గ్రామస్తుల అవసరాలకు అంబులెన్స్‌ను అందించిన లేబొరేటరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

చురుగ్గా ఓటరు సర్వే



మునగపాకలో ఓటరు సర్వే చేస్తున్న బీఎల్వోలు

మునగపాక: మండల వ్యాప్తంగా ఓటరు సర్వే చురుగ్గా సాగుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో సమగ్ర ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాల్లో సవరణలు, తొలగింపులపై వివరాలు సేకరిస్తున్నారు. కొత్తగా ఓటరు నమోదుకోసం దరఖాస్తులు అందిస్తున్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు

యలమంచిలి: ఈ నెల 22న విజయవాడలో కార్మికుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు పిలుపునిచ్చారు. ఆదివారం యలమంచిలి పట్టణంలో మున్సిపల్ కార్మికులతో సమావేశమైరాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు కార్మికులంతా ఛలో విజయవాడ సభను తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం అమలు తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.నూకరాజు, సీహెచ్ వెంకటరమణ, డి.మహేష్, చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆనాటి స్నేహం.. ఆనంద గీతం



కోటవురట్ల హైస్కూల్ 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు



కొండకర్ల వద్ద రాంబిల్లి ఉన్నత పాఠశాల 1997-98 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

కోటవురట్ల: చిన నాటి స్నేహ బంధం అపూర్వం. పుస్తకాలు మోస్తూ, ఇష్టం ఉన్నా లేకున్నా పాఠాలు వింటూ గడిపిన ఆ రోజులు గుర్తుకు వస్తే ఏదో తెలియని అనుభూతి. గురువుల బెత్తం దెబ్బలు, మొట్టికాయలు, తెలిసీతెలియని క్షణికావేశంలో గొడవలు, అలకలు అన్నీ ఇపుడు మధుర స్మృతులే. వాటిని మళ్లీ తమ కళ్ల ముందు నిలిచేలా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1997–98లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం మళ్లీ కలిశారు. ఆనాటి విషయాలను గుర్తుకు తెచ్చుకుంటూ, ఆత్మీయంగా పలకరించుకుంటూ పరవశించిపోయారు. ఎక్కడెక్కడో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నవారు కొందరైతే, వ్యాపారాలు చేస్తూ ఉన్నత స్థాయిలో ఉన్నవారు మరికొందరు. రైతులు, ఇంజినీర్లు, లాయర్లు, డాక్టర్లు, పోలీసులు, గృహిణులు ఇలా రకరకాల బాధ్యతల్లో ఉన్నవారంతా, వాటన్నింటినీ మరచి, చిన్న పిల్లలుగా మారారు. పాతికేళ్లనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమలో ఎవరికి ఏ కష్టం వచ్చినా మేమున్నామంటూ భరోసా ఇచ్చుకున్నారు. ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపి, ఆ జ్ఞాపకాలను పదిలంగా దాచుకుంటూ వీడ్కోలు చెప్పుకున్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల ఆవ వద్ద రాంబిల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థులు సందడి చేశారు. రాంబిల్లి ఉన్నత పాఠశాలలో 1997–98లో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయిక జరిగింది. ఒకరినొకరు పరస్పరం ఆత్మీయంగా పలకరించుకుని, కష్ట సుఖాలు పంచుకున్నారు. చిననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. భవిష్యత్‌లో ఎవరికి కష్టం వచ్చినా సహకరించుకోవాలని తీర్మానించారు.

తెలుగుకు వెలుగునిద్దాం



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీకాంత్



మహాభారతంపై వ్యాసరచనలో విద్యార్థులు

అనకాపల్లిటౌన్: మాతృభాష కన్నతల్లితో సమానమని, ఇతర భాషలు నేర్చుకుంటూనే తెలుగుభాష ప్రాముఖ్యతకు కృషి చేయాలని రామ్‌కీ ఫౌండేషన్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.శ్రీకాంత్ అన్నారు. స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుకు వెలుగు నిద్దాం పేరిట ఇతర రాష్ట్రాల్లో వారి ప్రాంతీయ భాషల్లో దుకాణాల బోర్డులు పెట్టినట్లే, మన రాష్ట్రంలో కూడా వ్యాపారస్తులందరూ తమ దుకాణాల ముందు తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు నేలలో జన్మించిన ప్రతి ఒక్కరూ మహా భారతంపై పఠనాసక్తిని పెంచుకోవాలన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ప్రతినిధులు కె.రామ్మోహన్‌రావు, జి.రంగబాబులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు తెలుగుభాష గొప్పదనాన్ని గుర్తించాయన్నారు., నేటి సమాజంలో పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు మహాభారతం, రామాయణం చదివేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులకు మహాభారతంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. 27న వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పి.అమరజ్యోతి, కోరాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్యకర్తల వినతి



మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందించారు. గాజువాక, మిందిలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసిన ప్రతినిధులు వారి సమస్యలు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే నేరుగా సరఫరా, మెనూ చార్జీల పెంపు, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, పదోన్నతులు, ఆన్‌లైన్ డేటా భారం తగ్గింపు, మినీ అంగన్‌వాడీల స్థాయి పెంపు, టీఏ, డీఏల చెల్లింపు తదితర అంశాలపై మంత్రికి వినతిపత్రం ద్వారా మొరపెట్టుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, ఉపాధ్యక్షులు కె.కాసులమ్మ, కె.ఉమానారాయణమ్మ తదితరులున్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో దిబ్బవీధి భేష్



శ్రీసీతారామ దేవస్థానం ప్రార్థనా మందిరాన్ని ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు

తుమ్మపాల: ఆధ్యాత్మిక, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణలో దిబ్బవీధి జిల్లాలోనే పేరొందిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. పట్టణంలోని దిబ్బవీధి శ్రీసీతారామ దేవస్థానం ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. దేవస్థానం అనుబంధ సంస్థలైన శ్రీగౌరీ నాట్య మండలి, శ్రీగౌరీ బాలగణపతి క్రీడా సంఘంలు గత 40 ఏళ్లుగా చేపడుతున్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీలా రాంబాబు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పీవీ జగన్‌మోహన్‌రావులు పాల్గొన్నారు.